క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చిన్నచింతకుంట: మండలంలోని దమగ్నాపూర్‌లో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరై చెక్కులు పంపిణీ చేస్తారని.. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

శ్యాంసుందర్‌కు దళితరత్న అవార్డు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీకి చెందిన తుంగ శ్యాంసుందర్‌కు దళితరత్న అవార్డు దక్కింది. దళితజాతి అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు సోమవారం హైదరాబాద్‌లో దళితరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని శ్యాంసుందర్ తెలిపారు. అదే విధంగా తెలంగాణ దండోరా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గంగారం భీంరాజుకు సైతం అవార్డు అందజేశారు.

వక్ఫ్ భూమిని కాపాడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో వక్ఫ్ భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చించోలి రోడ్డులో పూసవి కుంట వద్ద ఉన్న మూడెకరాల వక్ఫ్ భూమిలో పేద ముస్లింలు లీజ్‌కు తీసుకొని వ్యవసాయం చేసుకునే వారని తెలిపారు. వక్ఫ్ భూమి కబ్జాకు గురికాకుండా రక్షించాలని కోరారు. కార్యక్రమంలో సాజిదా సికిందర్, 6వ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రహీం పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరా

నవాబుపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నట్లు ఎంఈఓ నాగ్యానాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జీహెచ్‌ఎం దశరథ్ నాయక్‌తో కలిసి పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్ట్-1 పుస్తకాలు వచ్చాయని.. పాఠశాలల ప్రారంభానికి ముందే టార్గెట్ ప్రకారం పుస్తకాలు అందించామన్నారు. త్వరలోనే నోట్ పుస్తకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు జనార్దన్, గోపాల్, శ్రీను, రవి, వెంకట్రాములు, రేవతి పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ నిబంధనల మేరకు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీ తప్పనిసరిగా ఇవ్వాలని డీఈఓ ప్రవీణ్ ఆదేశించారు. సోమవారం ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ.. సమాజం కోసం పనిచేసే జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు కూడా ఉన్నాయని అన్నారు. జిల్లా కేంద్రంలో కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఏ విద్యాసంస్థ అయిన రాయితీ ఇవ్వని పక్షంలో తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీలు సతీశ్, మణిప్రసాద్, ఈసీ మెంబర్లు మోహన్‌దాస్, రమణ, రవి, రాంకొండ, సీనియర్ జర్నలిస్టులు బస్వరాజు, భాస్కరాచారి, మధుసూదన్, నాగరాజు, సుదీప్, పాషా పాల్గొన్నారు.

'సినీ హీరో విగ్రహం ఏర్పాటు చేయొద్దు'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దివంగత సినీ హీరో కృష్ణ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలోని పాత డీఈఓ కార్యాలయం చౌరస్తాలో పెట్టొద్దని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు గోపాలకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండానే విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వెంటనే ఆ చర్యను ఆపాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దన్నారు. సినీ హీరో కృష్ణ మంచి నటుడని.. ఆయన విగ్రహాన్ని ఇతర ప్రాంతంలో పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సురేశ్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు



జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల టౌన్/రాజాపూర్/మిడ్జిల్/నవాబుపేట/చిన్నచింతకుంట: జిల్లాలోని విత్తన దుకాణాల్లో సోమవారం పోలీసు, వ్యవసాయశాఖల అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సీడ్స్, ఎరువుల దుకాణాల్లో టూటౌన్ ఎస్‌ఐ విజయభాస్కర్, మండల వ్యవసాయశాఖ అధికారి రాజేందర్ సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాల స్టాక్, పాకెట్ల లేబుల్స్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

- జడ్చర్ల పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు రాంపాల్, శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్ తదితర బిల్లులను పరిశీలించారు. ఇటీవల నకిలీ విత్తనాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది.
- రాజాపూర్ మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో ఎస్‌ఐ శివానందంగౌడ్, టాస్క్‌ఫోర్స్ అధికారి అనిల్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
- మిడ్జిల్ మండలంలోని విత్తన దుకాణాల్లో మహబూబ్‌నగర్ వ్యవసాయ అధికారిణి శృతి, ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు, ఏఓ సిద్దార్థ, ఏఈఓలు గౌస్, నారణ్‌రెడ్డి తదితరులు తనిఖీలు నిర్వహించారు.
- నవాబుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో ఏఓ కృష్ణకిశోర్ పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. దుకాణంలో ఉండే ప్రతి విత్తనం వివరాలు స్టాక్ బోర్డుపై ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని.. బిల్లులేని వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఎస్‌ఐ రాంలాల్ నాయక్ తనిఖీలు చేపట్టారు.



జడ్చర్ల పట్టణంలో..



రాజాపూర్‌లో..



మిడ్జిల్‌లో..

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి



కమిటీ ఎన్నికలో పాల్గొన్న అధికారులు

నవాబుపేట: మహిళా సంఘాల అభివృద్ధికి నూతన కమిటీలు కృషి చేయాలని డీపీఎం సలోమి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని జిల్లా అధికారుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనిత (యన్మన్‌గండ్ల), కార్యదర్శిగా జ్యోతి (అమ్మాపూర్), కోశాధికారిగా జ్యోతి (కొల్లూర్)లను ఎన్నుకున్నట్లు డీపీఎం తెలిపారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు. మహిళా సంఘాలకు రుణాల మంజూరు, రికవరీలో వందశాతం టార్గెట్ సాధించి ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ అధికారులు భాగ్యలక్ష్మి, లావణ్య, ఏపీఎం జీవరత్నం, సీసీలు రమాదేవి, కాంచన పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను సోమవారం చౌదర్‌పల్లి, బొక్కలోనిపల్లి గ్రామాల్లో పంపిణీ చేశారు. ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, తిరుపతయ్య, భీమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హన్మంతు

'రైతులకు ఇబ్బందులు రానివ్వం'



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రావు

గండేడ్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు అన్నారు. మండలంలోని వెన్నాచెడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని త్వరగా సేకరించేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. తహసీల్దార్ వెంట డీటీ మాధవి, జూనియర్ అసిస్టెంట్ రాంచంద్రయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్‌గడ్డ చౌరస్తా పరిశీలన



సిగ్నల్‌గడ్డ వద్ద మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ అంబేడ్కర్ చౌరస్తాను సోమవారం జాతీయ రహదారుల శాఖ ఏఈలు చంద్రకాంత్‌రెడ్డి, రవికుమార్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పరిశీలించారు. సిగ్నల్‌గడ్డ నుంచి పాతబజార్‌కు భారీ వాహనాల రాకపోకలు లేకపోవడంపై అఖిలపక్ష నాయకులు ఆందోళన చేపట్టడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు, నాయకులు సిగ్నల్‌గడ్డ చౌరస్తాను పరిశీలించారు. ఈ సందర్భంగా హైవే విస్తరణ మ్యాప్‌ను ఏఈలు ప్రదర్శించారు. పాతబజార్‌కు భారీ వాహనాలు వెళ్లాలంటే రైల్వే బ్రిడ్జి దాటి సర్కిల్ నుంచి యూటర్న్ తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. నేరుగా వెళ్లేందుకు మాత్రం డిజైన్ చేయలేదని వివరించారు. నేరుగా వాహనాలు వెళ్లేలా చేయాలంటే డిజైన్ మార్చాలా అని స్థానిక నాయకులు ఆరా తీశారు. సిగ్నల్‌గడ్డ అంబేడ్కర్ చౌరస్తా హైరిస్క్ జోన్‌గా గుర్తించినందున.. డిజైన్ మార్చేందుకు ఆస్కారం లేదని ఏఈలు తెలియజేశారు. కలెక్టర్, ఎంపీ, జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయిస్తే డివైడర్‌ను తొలగించి భారీ వాహనాలు పాతబజార్‌కు నేరుగా వెళ్లేలా చేయవచ్చని సూచించారు. హైరిస్క్ జోన్‌గా గుర్తించినందున అందుకు అంగీకారం కుదరకపోవచ్చన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేను కలిసి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.రవిశంకర్, బుక్క వెంకటేశం, మినాజ్, ఖాజా, ధ్రువ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



నవాబుపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పలు అంశాలపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ శిబిరంలో 70మంది పాల్గొని సంప్రదాయ నృత్యాలు, యోగా తదితర అంశాల్లో శిక్షణ పొందినట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. కాగా, శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. శిబిరం నిర్వహణకు సహకరించిన సీనియర్ సిటిజన్ ఫోరం నాయకుడు, యోగా గురువు వెంకటేశ్వరప్పను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిగుళ్లపల్లి ఆంజనేయులు, కోచ్‌లు నిర్మల, గోపాల్ పాల్గొన్నారు.

డా.ఆర్నాల్డ్ మృతికి సంతాపం

జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట ఎంబీ మెడికల్ చారిటబుల్ ఆస్పత్రి డాక్టర్ ఆర్నాల్డ్ అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఎంబీ సెంటినరి చర్చిలో ఆదరణ కూడిక నిర్వహించి.. ప్రత్యేక గీతాలాపన, వాక్య సందేశం, సాక్షాలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు, నాయకులు, అభిమానులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆర్నాల్డ్ అంత్యక్రియల్లో మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి, పాస్టర్లు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం



చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్‌కు చెందిన బోయ భీమన్న ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భీమన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారికి దానం చేశారు. పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వట్టెం శివకుమార్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నర్వ: వందేమాతరం ఫౌండేషన్, భారత్ ఆర్ట్స్ లెర్నింగ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరానికి వందేమాతరం కార్యకర్తలుగా పనిచేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్ ఆపై అర్హతలు కలిగిన వారు చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 6300949477, 9392187342, 8179920338 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వహించొద్దు

సాక్షి ఎఫెక్ట్..



గురుకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ రవినాయక్

నవాబుపేట: మండలంలోని గురుకుంట కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో వర్షానికి తడిసి మొలకెత్తిన విషయం పాఠకులకు విదితమే. దీనిపై 'సాక్షి'లో ప్రచురితమైన 'మొలకెత్తిన ధాన్యం' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. సోమవారం గురుకుంట కొనుగోలు కేంద్రాన్ని డీసీఓ రవినాయక్ పరిశీలించి.. మొలకెత్తిన ధాన్యంపై ఆరా తీశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించక పోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో ధాన్యాన్ని తరలించడం లేదని పలువురు డీసీఓ దృష్టికి తీసుకువచ్చారు. కాగా, లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో కొంత జాప్యం జరిగిందని.. ఇక నుంచి ఇలాంటి సమస్య రాకుండా చూస్తామని డీసీఓ అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండరాదని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట మండల అధికారులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

బ్రిడ్జిల వద్ద మొక్కల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



శ్రీనివాసకాలనీలోని చిక్కుడువాగు వంతెనపై మొక్కలు నాటుతున్న కూలీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని అబ్దుల్‌ఖాదర్ దర్గా సమీపంలో ఉన్న రహమానియా బ్రిడ్జి, శ్రీనివాసకాలనీ సమీపంలోని చిక్కుడువాగు వంతెనకు ఇరువైపులా ఎండిపోయిన మొక్కలను మున్సిపల్ సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. ఏటవాలుగా ఉన్న చిన్న కుండీలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. కాగా, కొన్ని నెలలుగా వీటి సంరక్షణను సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో తరచూ ఎండిపోతున్న వైనంపై 'సాక్షి'లో ఈనెల 20న 'పచ్చదనం ఏ'మాయె!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు తాజాగా ఈ రెండు ప్రాంతాల్లో పచ్చదనం కనిపించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జడ్చర్ల టౌన్: పంట మార్పిడితో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని మల్లెబోయిన్‌పల్లి రైతువేదికలో సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో అవసరం మేరకు మాత్రమే రసాయనిక ఎరువులు వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. అదే విధంగా విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలతో సాగునీటిని ఆదా చేసుకోవచ్చన్నారు. వానాకాలంలో పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, శాస్త్రవేత్తలు డా.భూషణ్‌రావు, డా.కళ్యాణి, డా.శివరాజ్, ఉద్యానశాఖ అధికారి మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: అమావాస్యను పురస్కరించుకొని జడ్చర్ల మండలం శ్రీగిరి క్షేత్రంలోని అష్టలక్ష్మి ఆలయంలో సోమవారం ఆచార్య కృష్ణానందస్వామి ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించి.. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ అక్షిత – రమేశ్, సావిత్రి – రమేశ్ దంపతులతో పాటు బుక్క నారాయణ, రాంచంద్రారెడ్డి, రాధ, రమాదేవి, సుధాకర్, నాగేందర్ పాల్గొన్నారు.


రూ.34వేల జరిమానా వసూలు



హోల్‌సేల్ షాపు యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు అమ్ముతున్న హోల్‌సేల్ దుకాణాలపై మూడో రోజు సోమవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 200 దుకాణాల్లో తనిఖీలు చేపట్టగా.. అందులో 34 మంది యజమానులకు రూ.34వేల జరిమానా విధించి, వసూలు చేశారు. ఏకంగా లక్కీ ట్రేడర్స్‌కు రూ.10వేలు, ఎస్‌ఎఫ్‌సీ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.5వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వాణికుమారి, రవీందర్‌రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ఖలీద్ బిన్ ఇక్బాల్



అడ్డాకుల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఖలీద్ బిన్ ఇక్బాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అడ్డాకులలో డీటీగా పనిచేస్తున్న శ్రీధర్‌బాబు తహసీల్దార్‌గా పదోన్నతి పొంది నల్లగొండ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నేడు నాటక ప్రదర్శన

చిన్నచింతకుంట: అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం కురుమూర్తి స్వామి దేవస్థానంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్ట్ థియేటర్స్ సభ్యుడు టి.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8:30 గంటలకు ప్రారంభమయ్యే నాటక ప్రదర్శనను భక్తులు వీక్షించాలని కోరారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ



ప్రమాదకరంగా మారిన డ్రెయినేజీ ఇదే..

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డు పక్కనున్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. సర్వీస్ రోడ్డు మలుపు నుంచే తహసీల్దార్, ఎంపీడీఓ, ఆస్పత్రికి వెళ్లే వాహనాలు తిరుగుతుంటాయి. డ్రెయినేజీ వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. వర్షాల కారణంగా డ్రెయినేజీ మరింత కోతకు గురైతే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటు రహదారి నిర్వాహకులు, అటు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. డ్రెయినేజీని బాగు చేయించాలని సోమవారం స్థానిక ఎస్సీకాలనీకి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్వసతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, బాలరాజు, సుదర్శన్, మనోహర్, నాగవర్ధన్, సునీల్ పాల్గొన్నారు.